
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



మినీ స్టేడియాలపై నజర్
జిల్లాలో చేపట్టిన ఐదు మినీ స్టేడియాల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 8లో



అప్పీలా.. కొత్త నోటిఫికేషనా?
సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించగా కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. 10లో

గరిష్టం / కనిష్టం
29° / 24°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల మబ్బులతో వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులకు అర్చకులు బుధవారం వైభవంగా స్నపన తిరుమంజనం చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇక శుక్రవారం లక్ష్మీతాయారు అమ్మవారికి పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నారు.

వైభవంగా రుద్రహోమం



స్వామివారిని తీసుకొస్తున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో బుధవారం వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతిపూజ అనంతరం రుద్రహోమం జరిపించి, చివరగా పూర్ణాహుతి చేశారు. పూజలో పాల్గొన్న దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు పూసుగూడెం జీపీ..

చుంచుపల్లి : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ రాష్ట్రస్థాయి అవార్డుకు ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామపంచాయతీ ఎంపికైంది. ఈ మేరకు హైదరాబాద్ టీఎస్ఐఆర్‌డీ హాల్‌లో గురువారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ బానోత్ విజయ, కార్యదర్శి అచ్చ శ్రీను అవార్డు అందుకోనున్నారు. ఈ మేరకు వారిద్దరితో పాటు డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, స్వచ్ఛ భారత్ మిషన్ విభాగం సిబ్బంది రేవతి, ఖాదర్ తదితరులు హైదరాబాద్ వెళ్లారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేసేందుకు అభ్యర్థుల ఎంపికకు బుధవారం రాత పరీక్ష నిర్వహించారు. ఇటీవల ఆన్‌లైన్ టికెట్ల విక్రయం ప్రారంభించిన నేపథ్యంలో ఈ కౌంటర్ల వద్ద పనిచేసేందుకు ప్రైవేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో పనిచేసే ఇద్దరిని ఈ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు.

ఓటుహక్కుపై అవగాహనకు పోటీలు

కొత్తగూడెంటౌన్: ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించేందుకు స్కిట్(లఘు చిత్ర) పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న పాత పాల్వంచలోని ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు పోటీలు జరుగుతాయని, 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు స్కిట్, గేయ, కవితలు, పద్య పోటీలు నిర్వహిస్తామని వివరించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10,000, రూ.8000, రూ.5000 అందజేస్తామని, జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

బల ప్రదర్శనతో

ట్రాఫిక్ చిక్కులు



ఇల్లెందులో భారీ సంఖ్యలో కార్లతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు (ఫైల్)

రాజకీయ పార్టీల ర్యాలీలతో తలెత్తుతున్న సమస్య
- రాబోయే రోజుల్లో మరిన్ని ఊరేగింపులు
- పోలీసుల ఆంక్షలతో విలవిల్లాడుతున్న ప్రజలు
- మాస్టర్ ప్లాన్ రూపొందించాలని వేడుకోలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడడంతో రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. తమ భావజాలాన్ని, ప్రజల్లో తమకున్న బలాన్ని చాటుకునేందుకు ఆయా పార్టీలు జిల్లాలోని ప్రధాన రహదారుల నుంచి ఊరేగింపులు చేపడుతున్నాయి. పోలీసు శాఖ అనుమతులు తీసుకునే ర్యాలీలు చేపడుతున్నా.. ఈ సందర్భంగా ఎదురయ్యే ట్రాఫిక్ చిక్కులను అధిగమించేందుకు పోలీసు శాఖ అమలు చేస్తున్న నిర్ణయాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

జిల్లా కేంద్రంలో మరింత ఎక్కువగా..

అన్ని రాజకీయ పార్టీల నేతలు తమ బల ప్రదర్శనకు జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో నెలలో రెండు, మూడుసార్లు రాజకీయ ర్యాలీలు జరగడం పరిపాటిగా మారింది. ఇక ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని ప్రభుత్వ పరంగా, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక, మహిళా, రైతు సంఘాలు చేసే ర్యాలీలు వీటికి అదనం. రాజకీయ పక్షాలు చేపట్టే ర్యాలీలు ముర్రేడు వాగు వద్ద మొదలై ఎంజీ రోడ్డు మీదుగా సూపర్‌బజార్, రైల్వే అండర్ బ్రిడ్జి, బస్ స్టేషన్, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా విద్యానగర్ వరకు కొనసాగుతున్నాయి. మరికొన్ని ర్యాలీలైతే సుజాతనగర్ వద్ద ప్రారంభించి కొత్తగూడెం మీదుగా పాల్వంచ వరకు భారీ వాహన శ్రేణితో నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో పోలీసులు ఎంజీ రోడ్డులో ఇతర వాహనాల రాకపోకలపై నిషేధం విధిస్తున్నారు. గొల్లగూడెం నుంచి వచ్చే వాహనాలను రైల్వేస్టేషన్ దగ్గర, భజన మందిరం నుంచి వచ్చే వాహనాలను ఎస్‌బీఐ దగ్గర, లేపాక్షి నుంచి వచ్చే వాహనాలను పెట్రోల్ రోడ్డు దగ్గర, రైటర్ బస్తీ వాహనాలను పోస్టాఫీస్ దగ్గర.. ఇలా ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించి ఆపేస్తున్నారు. దీనికి తోడు కొత్తగూడెంలో రైల్వే అండర్ బ్రిడ్జి, ముర్రేడువాగు ప్రాంతాలు ట్రాఫిక్ పరంగా బాటిల్ నెక్‌లుగా ఉన్నాయి. అంతే కాదు ఈ రెండు చోట్ల రోడ్ల మీదకు వచ్చిన వారికి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురైతే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు కూడా అందుబాటులో లేవు. ఎంత సేపైనా ట్రాఫిక్ క్లియర్ అయ్యేంతవరకు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఎదురుచూడాల్సిందే. ఇలా వివిధ పనులపై బయటకు వచ్చిన వారికి ర్యాలీలు నరకం చూపిస్తున్నాయి.

ఇల్లెందు దిగ్బంధనం..

ఇటీవల ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇల్లెందు పర్యటనను పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ అనుచర కార్యకర్తలు వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అధికార పార్టీకి చెందిన కార్యక్రమం కావడంతో పోలీసులు ఈ టూర్‌లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రంగంలోకి దిగారు. దీంతో ఇటు కొత్తగూడెం, ఖమ్మం రూట్‌లో కరెంటాఫీసు దగ్గర, వరంగల్, పాకాల రూట్‌లో గోవింద్ సెంటర్ దగ్గరే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ సెంటర్లలో బారికేడ్లు, పోలీసు జీపులు అడ్డంగా పెట్టి వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. పట్టణంలో ర్యాలీ ముగిసే వరకు ఈ ఆంక్షలు కొనసాగాయి. దీంతో పట్టణ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇల్లెందుకు రావాల్సిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరెంటాఫీసు నుంచి బైపాస్‌రోడ్డు మీదుగా సీఎస్‌పీ వరకు ఊరంతా చుట్టి రావాల్సి వచ్చింది. ఇల్లెందులో రోడ్డు మధ్యన డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్ కూడా ఉంది. ఒక వైపు పొలిటికల్ యాత్రకు అనుమతి ఇచ్చి మరోవైపు రెగ్యులర్ ట్రాఫిక్ వెళ్లేలా చర్యలు తీసుకుంటే బాగుండేదని, తమకు తిప్పలు తప్పేవని స్థానికులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగూడెం ర్యాలీల విషయంలోనూ ఇలాగే డివైడర్ ఉన్నా ప్రధాన రహదారి మొత్తాన్ని బ్లాక్ చేస్తున్నారు.

మాస్టర్ ప్లానే మార్గం..

ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, అశ్వారావుపేట వంటి పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు మరిన్ని జరిగే అవకాశం ఉంది. పైగా రాజకీయ ర్యాలీలు ఎప్పుడూ నిర్ణీత సమయానికి ప్రారంభం కావు.. ముగియవు. గంటల కొద్దీ ఆలస్యం అవుతుంటాయి. దీంతో ముందుగా నిర్ణయించిన సమయం కంటే రెట్టింపుగా ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని సామాన్యులకు సమస్య కాకుండా పోలీసులు ట్రాఫిక్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలనే డిమాండ్ వస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా పట్టణాలు, మండలాల్లో ఉన్న ప్రధాన రోడ్లు, కూడళ్లలో ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ మళ్లింపు, ఆంక్షల వంటివి విధిస్తే ఆ విషయాన్ని వివిధ ప్రచార సాధనాల ద్వారా ముందుగానే తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్‌లో ముసలం

- ఇల్లెందు పురపాలక వైస్ చైర్మన్ పదవికి జానీపాషా రాజీనామా!
- ఎమ్మెల్యే హరిప్రియ తీరుతో మనస్తాపం
- రాజకీయాల్లో పావుగా వాడుకున్నారంటూ ఆవేదన
- ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు కొత్త ఇబ్బందులు



జానీపాషా



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియా నాయక్‌ను మరో వివాదం చుట్టుముట్టింది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే జానీపాషా తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే హరిప్రియకు బుధవారం లేఖ అందజేశారు.

ఒకటి వెనుక ఒకటి..

ఇల్లెందు మున్సిపాలిటీ మేనేజర్ అంకుషావలి వ్యవహారశైలిపై ఇటీవల విమర్శలు వచ్చాయి. దీనికి జానీపాషానే కారణమని, ఆయన వల్ల తనకు ప్రాణహాని ఉందని అంకుషావలి ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తికి మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతోబుధవారం కమిషనర్‌గా ఉన్న కుమారస్వామిని తప్పించి కొత్త కమిషనర్‌గా టి.నవీన్‌కుమార్‌ను నియమించారు. దీంతో పాటు ఇటీవల మున్సిపాలిటీలో చేపట్టిన పలు కార్యక్రమాల్లో వైస్ చైర్మన్‌గా ఉన్న జానీపాషాకు ప్రాధాన్యత దక్కలేదు. మున్సిపాలిటీలో వేగంగా మారిపోతున్న పరిస్థితులపై తాడోపేడో తేల్చుకునేందుకు బుధవారం రాత్రి ఎమ్మెల్యే హరిప్రియతో జానీపాషా, తనకు మద్దతుగా ఉన్న పది మంది కౌన్సిలర్లు సమావేశమయ్యారు.

నా ప్రమేయమేమీ లేదు...

జానీపాషాపై పోలీసులకు ఫిర్యాదు చేయడం మొదలు మున్సిపల్ కమిషనర్ మార్పు వరకు చోటు చేసుకున్న పరిణామాల్లో తన ప్రమేయమేమీ లేదని ఎమ్మెల్యే హరిప్రియ వారికి బదులిచ్చినట్టు సమాచారం. తన దృష్టికి రాకుండానే ఈ మార్పులన్నీ జరిగాయంటూ ఆమె నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే గత ఏడాది కాలంగా మున్సిపాలిటీలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల్లో తనను ఒక పావుగా వాడుకున్నారంటూ జానీపాషా ఎమ్మెల్యే దగ్గర ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అంతే కాక ప్రాధాన్యత లేని పదవిలో తాను కొనసాగలేనంటూ బాధపడినట్టు సమాచారం. చివరకు 'ఇకపై మీ రాజకీయాలకు పనిముట్టుగా ఉండబోను' అని చెప్పారు. అనంతరం వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నానని పేర్కొంటూ ఎమ్మెల్యే హరిప్రియకు తెల్ల కాగితంపై లేఖ రాసి ఇచ్చారు. కాగా, తొందరపడవద్దని, అన్ని విషయాలు గురువారం మాట్లాడుకుందామని ఎమ్మెల్యే సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు.

ఏడాది కాలంగా వర్గపోరు..

ఇల్లెందు మున్సిపాలిటీలో ఏడాది కాలంగా చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జానీపాషా మధ్య వర్గపోరు నెలకొంది. కౌన్సిలర్లు సైతం చెరో వర్గంలో చేరిపోయారు. ఈక్రమంలో తొలుత చైర్మన్ డీవీ.. ఎమ్మెల్యే హరిప్రియ వర్గంలో కొనసాగారు. చైర్మన్, వైస్ చైర్మన్ మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరుకుని జానీపాషాపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఆయన సాగు చేస్తున్న మామిడి తోటను ధ్వంసం చేసినా వెనుకంజ వేయలేదు. చైర్మన్ డీవీపై అవిశ్వాస తీర్మానం కోసం కలెక్టర్‌కు విన్నవించడమే కాక తన వర్గం కౌన్సిలర్లతో వైజాగ్‌లో క్యాంపు నిర్వహించారు. అయితే ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో ఈ వ్యవహారం సద్దుమణిగింది. ఆ తర్వాత మారిన రాజకీయ ముఖచిత్రంలో ఎమ్మెల్యే హరిప్రియ, చైర్మన్ డీవీకి మధ్య విబేధాలు తలెత్తాయి. దీంతో హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దంటూ ప్రెస్‌మీట్ పెట్టి మరీ డీవీ అధిష్టానాన్ని కోరారు. దీంతో వైస్ చైర్మన్ జానీపాషా, ఆయన మద్దతుగా ఉన్న కౌన్సిలర్లు ఎమ్మెల్యే క్యాంపులో చేరిపోయారు. కానీ గత మూడు రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలతో జానీపాషా సైతం ఎమ్మెల్యే తీరుపై ఆవేదనతో ఉన్నట్టుగా తెలుస్తోంది. మొత్తగా ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇల్లెందు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు సొంత పార్టీ నేతల తీరుతోనే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కేసీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు



కేసీఆర్‌తో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల గురించి వారు వివరించగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ పరిస్థితుల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, అశ్వారావుపేట, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, రాములునాయక్, సండ్ర వెంకటవీరయ్య, భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు?

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



ధన్‌బాద్ సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎస్‌సీఏ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ వినీత్‌తో కలిసి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో రూ.35 కోట్లతో పనులు చేపట్టామని, ముఖ్యంగా పాఠశాలల్లో చేస్తున్న పనులు అలస్యమవుతున్నాయని అన్నారు. నిధులు మంజూరు చేసినా సకాలంలో పూర్తి చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మంజూరైన నిధులకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ శిరీష, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, పీఆర్ ఈఈలు శ్రీనివాసరావు, మంగ్యా, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, డీఈఓ వెంకటేశ్వరాచారి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో జిల్లా నుంచి ఎంపికైన 15 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులతో పాటు ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీడీఓలను బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది చేసిన సేవలకు గ్రామాలు అభివృద్ధిలో ముఖచిత్రాలుగా మారుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

- ఎమ్మెల్యే పొదెం వీరయ్య, అసోం ఎంపీ నాబాకుమార్ శరాణి
- భద్రాచలంలో ఆదివాసీ సమన్వయ మంచ్ సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: దేశంలోని ఆదివాసీలంతా ఐక్యంగా ఉంటేనే హక్కులను కాపాడుకోవడం సాధ్యమని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, అసోం ఎంపీ నాబాకుమార్ శరాణి అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల దినోత్సవం సందర్భంగా భద్రాచలంలో బుధవారం ఆదివాసీ సమన్వయ మంచ్ భారత్ ఆధ్వర్యంలో భారీ సదస్సు నిర్వహించారు. దేశంలోని 20 రాష్ట్రాల నుంచి రెండు వేల మంది ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ నుంచి సభా వేదిక వరకు వివిధ వేషధారణలతో ఆదివాసీ సాంస్కృతిక శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో పొదెం వీరయ్య, నాబాకుమార్ శరాణి మాట్లాడుతూ.. ఆదివాసీలు ఎక్కడున్నా సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోవద్దని చెప్పారు. ప్రస్తుత పాలకులు ఆదివాసీల హక్కులను హరించేలా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పలు రాష్ట్రాల్లో వివిధ కులాలను షెడ్యూల్ జాబితాలో చేర్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఆదివాసీలను రాజకీయ పార్టీల నాయకులు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, వారి అభివృద్ధికి ప్రయత్నించడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా దేశంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు – పరిష్కార మార్గాలపై ప్రతినిధులు చర్చించారు. కార్యక్రమంలో పలు ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరు నెలలు.. రూ.1.85 లక్షలు

బాలాజీ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ ఇన్‌స్పెక్టర్ భేల్‌సింగ్ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. ఈ ఏడాది మార్చి 14 నుంచి ఈనెల 13 వరకు లెక్కించగా రూ.1.85 లక్షలు వచ్చినట్లు ఆలయ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

మున్సిపల్ కమిషనర్‌గా 'తోటమల్ల'



నవీన్‌ను సన్మానిస్తున్న చైర్మన్ తదితరులు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌గా తోటమల్ల నవీన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మున్సిపల్ డీఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



జానమ్మను సన్మానిస్తున్న మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు కందిమళ్ల సత్యనారాయణరెడ్డి, అంజిరెడ్డి తమ తండ్రి రాఘవరెడ్డి జ్ఞాపకార్థం రూ.10 లక్షలు విరాళం అందించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ఈ మొత్తం అందజేశారు. దీంతో సత్యనారాయణరెడ్డి, అంజిరెడ్డి తల్లి జానమ్మను బుధవారం గ్రామంలో మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఆత్మహత్య ఘటనలో ఒకరి అరెస్ట్

ఇల్లెందురూరల్: ప్రేమ విఫలమైందనే ఆవేదనతో మండలంలోని పోలారం గ్రామానికి చెందిన పులుసు వినోద్ ఆత్మహత్య ఘటనలో అదే గ్రామానికి చెందిన కత్తి భాస్కర్‌ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొమరారం ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

చర్ల: మండలంలోని సుబ్బంపేట సమీపంలో గోదావరి నది ఒడ్డుకు గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకు వచ్చింది. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై నర్సిరెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. గుర్తు పట్టలేని స్థితిలో పూర్తిగా కుళ్లిపోయి ఉన్న మహిళ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి వివరాలను నమోదు చేశారు. మృతి చెందిన ఉన్న మహిళ వయసు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహంపై దుస్తులు లేవని సీఐ రాజగోపాల్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

దుమ్ముగూడెం : మండలంలోని చిన్నబండిరేవు గ్రామానికి చెందిన అనిల్ (22) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి విషయాన్ని కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో తెలియపరిచారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: భర్త, అత్తామామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పట్టణంలోని ఇల్లెందులపాడు ప్రాంతానికి చెందిన మానస పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె భర్త కృష్ణతోపాటు అత్త, మామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవూఫ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

మినీ స్టేడియాలపై నజర్

- జిల్లాలో ఐదు మంజూరుకాగా మూడింటి పనులే ప్రారంభం
- నిధుల లేమితో మూడేళ్ల నుంచి సాగుతున్న నిర్మాణం
- ఉన్న నిధుల మేరకు పూర్తిచేయాలని ఉన్నతస్థాయి ఆదేశాలు
- రెండు నెలల్లో అంబాటులోకి తెచ్చేలా అధికారుల చర్యలు



నిర్మాణంలో ఉన్న ఇల్లెందు మినీ స్టేడియం

ఇల్లెందు: మినీ స్టేడియాల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడేళ్ల నుంచి పనులు చేపడుతున్నా ఇప్పటివరకు పూర్తికాలేదు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సదుపాయాలతో కూడిన స్టేడియాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఐదింటిని మంజూరు చేసింది. ఒక్కో స్టేడియానికి రూ.2.10 కోట్లు నుంచి రూ.2.65 కోట్ల వరకు కేటాయించి, ఐదెకరాల స్థలంలో నిర్మించాలని సూచించింది. అయితే ప్రభుత్వం కేటాయించినా నిధులు సరిపోకపోవడం, నిధులున్నా సకాలంలో పనులు జరగకపోవటంతో వీటి నిర్మాణం పూర్తికావడంలేదు. భద్రాచలంలో స్థలం లేదు. అశ్వారావుపేటలో మూడు దఫాలు టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇల్లెందులో 75 శాతం పనులు పూర్తి కాగా, మణుగూరు, పాల్వంచ(కొత్తగూడెం)లో ఇప్పుడిప్పుడే పనులు సాగుతున్నాయి. అందుబాటులో ఉన్న నిధుల మేరకు పనులు పూర్తిచేయాలని ఇటీవల ఉన్నతాధికారులను ఆదేశాలు అందాయి. దీంతో నిర్మాణాలను పరిశీలించిన జిల్లా యువజన క్రీడల శాఖాధికారి పరంధామరెడ్డి రెండు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్టేడియం పూర్తయితే..

మినీ స్టేడియం నిర్మాణం పూర్తయితే క్రీడాకారులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. టెన్నిస్, చెస్, టేబుల్ టెన్నిస్, షటిల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడలు ఆడుకునే అవకాశం ఉంది. ఇల్లెందు ప్రాంతంలో ఇప్పటివరకు టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు లేరు. మినీ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ కోర్టు ఏర్పాటవుతుండటంతో క్రీడాకారులు ఆడుకునే అవకాశం ఉంటుంది. ప్రత్యేకంగా వివిధ రంగాల్లో తర్ఫీదు ఇచ్చేందుకు శిక్షితులైన కోచ్‌లు కూడా ఉంటారు. పలు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించిన క్రీడాకారులు కూడా ఈ ప్రాంతంలో ఉండటం వల్ల వారిని స్ఫూర్తిగా తీసుకుని ఇతరులు ఆయా రంగాల వైపుకు మార్గం ఎంచుకునే అవకాశం కలుగుతుంది.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎదురుచూస్తున్నాం..



ఇల్లెందులో స్టేడియం ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురు చూస్తున్నాం. కబడ్డీ కోర్టు, షటిల్ కోర్టు కూడా ఉండటంతో నిత్యం సాధన చేసుకోవచ్చు. కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటారు. పలువురు తమ క్రీడాప్రతిభను మెరుగుపర్చుకుంటారు.

–నాయిని సైదులు, ఇల్లెందు

అధికారులు దృష్టి పెట్టాలి



ఆటల మీద ఇష్టం ఉన్నా సదుపాయాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. యువత క్రీడల్లో రాణించాలంటే స్టేడియం తప్పకుడా ఉండాలి. అధికారుల పర్యవేక్షణ పెంచాలి. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయించాలి.

–చాందావత్ రమేష్‌బాబు, ఇల్లెందు

వేగంగా పూర్తి చేస్తాం..



ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు ప్రాంతాల్లో మినీ స్టేడియాలు రెండు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించాం. ఇంజనీరింగ్ అధికారులకు తగిన సూచనలు చేశాం. వేగంగా పనులు సాగేలా చూస్తాం. స్టేడియం నిర్మాణం పూర్తి కాగానే ప్రహరీ, ఇతర సదుపాయాల మీద దృష్టి కేంద్రీకరిస్తాం.

– పరంధామరెడ్డి, డీవైఎస్‌ఓ

అర్హులందరికీ ఆయుష్మాన్ భవ కార్డులు

- వర్చువల్ పద్ధతిన ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- పాల్వంచలో పాల్గొన్న కలెక్టర్ ప్రియాంక ఆల, వైద్యాధికారులు



రాష్ట్రపతి సందేశాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, డీఎంహెచ్‌ఓ శిరీష తదితరులు

పాల్వంచ : అర్హులందరికీ ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. పాల్వంచ సీహెచ్‌సీలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ఢిల్లీ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం వర్చువల్ పద్ధతిన ప్రారంభించగా కలెక్టర్ ప్రియాంక, డీఎంహెచ్‌ఓ శిరీష, డీసీహెచ్‌ఎస్ రవి, ఆస్పత్రి సూపరింటెండెంట్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మణికంతా రెడ్డి హాజరయ్యారు. రాష్ట్రపతి సందేశం ముగిసిన తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని, దీనికి అదనంగా ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని చెప్పారు. ఈ పథకాన్ని మూడు విభాగాలుగా విభజించామని, ఆయుష్మాన్ ఆప్కే ద్వార్, ఆయుష్మాన్ సభ, ఆయుష్మాన్ మేళా ద్వారా ప్రతి ఇంటి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయుష్మాన్ మేళా ద్వారా పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వ్యాధి నిర్ధారణపై ప్రజల్లో అవగాహన కార్యాక్రమాలు నిర్వహిస్తామని, ఆయుష్మాన్ సభల ద్వారా అన్ని గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి పేర్లు నమోదు చేస్తామని, ఈనెల 17 నుంచి అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఈ పథకంలో నమోదైన వారికి రూ.5 లక్షల విలువైన వైద్య సేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఏ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు నిర్వహించేది ముందే షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సోమరాజు దొర, సురేశ్ పాడ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం : మండలంలోని ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యశాలలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని సర్పంచ్ కొర్సా సునీత బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, ఉప సర్పంచ్ కొర్సా నరసింహారావు, వైద్య సిబ్బంది ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

ములుగు ఎమ్మెల్యే సీతక్క



అమ్మవారికి పూజలు చేస్తున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

మణుగూరు రూరల్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క పేర్కొన్నారు. బుధవారం ఆమె తోగ్గూడెంలోని సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీకుచెట్లబజార్‌లో జరిగిన ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలుత ఎమ్మెల్యే సీతక్కకు ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో మళ్లీ కాంగ్రెస్‌దే గెలుపు

- టికెట్ ఎవరికి ఇచ్చినా ఐక్యంగా పనిచేస్తాం
- విలేకరుల సమావేశంలో పార్టీ ఆశావహులు



ఐక్యత చాటుతున్న కాంగ్రెస్ పార్టీ ఆశావహులు

టేకులపల్లి: ఇల్లెందు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, మూడోసారి కచ్చితంగా కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులు చీమల వెంకటేశ్వర్లు, భూక్య దళ్‌సింగ్‌నాయక్, బాణోతు బాలాజీరావు నాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, బాణోతు ప్రవీణ్ నాయక్, డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ సంజయ్, ఆంగోతు నామోదర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని, పోలీసు కేసులు, జైలు శిక్షలు అనుభవిస్తూ, ఆర్థికంగా నష్టపోయిన ఆశావహుల గురించి అధిష్టానం ఆలోచించాలని కోరారు. తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం ఐక్యంగా పని చేసి గెలిపిస్తామని పేర్కొన్నారు. అయితే 2014లో కోరం కనకయ్య, 2018లో హరిప్రియ కాంగ్రెస్ నుంచి గెలిచి పార్టీకి ద్రోహం చేశారని, స్వార్థం కోసం బీఆర్‌ఎస్‌లో చేరారని విమర్శించారు. రెడీమేడ్‌గా వచ్చిన వారికి, వలస వాదులకు, పార్టీ ద్రోహులకు టికెట్ ఇస్తే ఉద్యమ బాట పడతామని పేర్కొన్నారు. అందరినీ కలుపుకుని పోవాల్సిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, తన అనుచరుడైన కోరం కనకయ్యకే ప్రాధాన్యమిస్తూ ఆయనే అభ్యర్థిగా ప్రచారం చేస్తుండటం సరైంది కాదన్నారు. మండల అధ్యక్షుడు భూక్య దేవా నాయక్, మహిళాధ్యక్షురాలు స్వప్న, ఇస్లావత్ సాయి, సరిలాల్, నాగేందర్, రవీందర్, బన్సీలాల్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



దీక్ష చేస్తున్న బీఎస్పీ నాయకులు, జర్నలిస్టులు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్ డిమాండ్ చేశారు. జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో వెన్నుదన్నుగా ఉన్న జర్నలిస్టులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందని అన్నారు. గత జనవరిలో కలెక్టరేట్ ప్రారంభోత్సంలో నెల రోజుల్లో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, కానీ ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు గెలిచాక విలేకరులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి నెల రోజుల్లో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారని, నాలుగున్నర ఏళ్ల గడిచినా హామీ అమలు చేయలేదని విమర్శించారు. దీక్షలను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఇమ్మంది ఉదయకుమార్ ప్రారంభించారు. ఈ దీక్ష శిబిరంలో విలేకరులు పోతు రాజేందర్, డి.వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, పి.సూరిబాబు, జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ నర్సింహారావు, ఏజె శ్రీనివాస్, మహేష్, నాగచంద్ర, కొండ జంపన్న కూరపాటి రవీందర్, మల్లికార్జున్‌రావు, బండి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శన

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ ఇంటర్ కాలిగేటివ్ లిటరసీ అండ్ కల్చరల్ ఫెస్ట్ మహిళోత్సవ్ అలరించింది. వ్యాసరచన, వక్తృత్వ, రంగోలి, ర్యాంప్‌వాక్, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు తదితర అంశాలపై విద్యార్థినులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సింగరేణి జీఎం(ఎడ్యుకేషన్) ఎస్.వెంకటేశ్వరరావు దంపతులు, సింగరేణి ప్రధానాసుపత్రి సీఎంఓ డాక్టర్ సుజాత, కళ్యాణి, హరిణి, బెనడిక్ట్ నికోలస్, ప్రిన్సిపాల్ శారద, జి.శైలజ, కె.సావిత్రి, జి.మంజుల, ఎ.దేవకి పాల్గొన్నారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

బూర్గంపాడు: అక్రమంగా లారీలో తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బూర్గంపాడు పోలీసులు బుధవారం తెల్లవారుజామున సారపాకలో పట్టుకున్నారు. పాల్వంచలోని నరిగే రవీంద్రనాథ్‌కు చెందిన శ్రీరామాంజనేయ రైస్‌మిల్ నుంచి ఒడిశాలోని మల్కనగిరికి బియ్యం తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. మల్కనగిరికి చెందిన లారీ డ్రైవర్ సదాశివ, గణేష్ చంద్రదేవ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటు రైస్‌మిల్లు ఓనర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సైలు రాజ్‌కుమార్, నాగబిక్షం, సివిల్ డీటీ కస్తాల వెంకటేశ్వర్లు తెలిపారు.

పాల్వంచరూరల్: నాగారం గ్రామసమీపంలో ధారకాంతరెడ్డి కోళ్లఫారంలో అక్రమంగా నిల్వచేసిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడి సూపర్‌వైజర్ పల్లపు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, రేషన్ షాపులనుంచి బియ్యం కొని పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తేలింది. దీంతో శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

యాష్ ట్యాంకర్ పడి ఇద్దరు మృతి



అండర్ బ్రిడ్జి వద్ద ప్రమాద దృశ్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: యాష్ ట్యాంకర్ మీదపడి ఇద్దరు మృతి చెందిన సంఘటన కొత్తగూడెం పట్టణంలోని అండర్ బ్రిడ్జి మూలమలుపు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. చుంచుపల్లి మండలం రాంపూర్‌కు చెందిన శ్రీనివాస్(40) పట్టణంలోని గణేష్ టెంపుల్ ప్రాంతంలో కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రాణి కర్రీ పాయింట్‌లో పనిచేస్తోంది. బుధవారం రాత్రి కర్రీ పాయింట్ మూసివేసి ఇద్దరు ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. అదే సమయంలో యాష్ ట్యాంకర్ పాల్వంచ నుంచి ఖమ్మం వైపు వెళ్తోంది. ఈ క్రమంలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద యాష్ ట్యాంకర్ అదుపు తప్పి మీదపడటంతో శ్రీనివాస్, రాణి అక్కడికక్కడే మృతి చెందారు. కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. విషయం తెలియగానే మృతుల కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణం అతివేగమేనని తెలుస్తుండగా, ట్యాంకర్ డ్రైవర్ పరారయ్యాడు. కాగా, ఆ మూలమలుపు ప్రమాదకరంగా ఉండడంతో పాటు హెచ్చరిక బోర్డులు లేకపోవడం, డివైడర్లపై నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చీకటిగా ఉండడం కూడా ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు. దీనికి తోడు అతివేగంగా ట్యాంకర్ వస్తుండడంతో స్కిడ్ అయి ద్విచక్రవాహనంపై పడింది. విషయం తెలియగానే పోలీసులు అక్కడికి చేరుకుని సింగరేణి నుంచి క్రేన్లు తెప్పించి ట్యాంకర్‌ను తీయించారు. కాగా, ఈ మూలమలుపు వద్ద గత ఐదేళ్లలో తొమ్మిది ప్రమాదాలు జరిగాయని, 10 మందికి పైగా మృత్యువాతపడ్డారని స్థానికులు చెబుతున్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి



వినాయకుడి ప్రతిమలు నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నదిలో గణపతి విగ్రహాల నిమజ్జనాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ మంగీలాల్ సూచించారు. బుధవారం ఆయన గోదావరి తీరంలో నిమజ్జనం చేసే ప్రాంతం, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనాలకు వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ నిలిచిపోకుండా, స్థానిక ప్రజలు, భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సీఐ నాగరాజు రెడ్డి, గ్రామ పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


సమ్మె విరమించిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం) స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం సమ్మె విరమించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆగస్టు 31 నుంచి సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు చాడా వెంకటరెడ్డి సమక్షంలో హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌ను కలిసి సమస్య విన్నవించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించి, విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు జోగలక్ష్మి, సావిత్రి, పద్మమాధవి, శ్రీనివాసరావు, సింధు, రాధమ్మ, జ్యోతి, నిర్మల, సునీత, సరళ, పార్వతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'వెయిట్‌లిఫ్టింగ్'లో బంగారు పతకాలు

ఇల్లెందు: బాలికల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన గంగాభవాని, రోషిణి బంగారు, సౌమ్య వెండి పతకాలు సాధించారు. ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో వీరు సత్తా చాటారు. ఈనెల 31న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారు. బుధవారం శిక్షకులు కావేటి రమేష్, నాగరాజు, ఐలయ్య, చీమల సుజాత, పరమేష్, శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, సందీప్, బార్గవ్ తదితరులు విజేతలను అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి




రవి(ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండా డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలోని ఓ ఇంట్లో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. హౌస్ నంబర్ 9వ డబుల్ బెడ్‌రూం ఇంట్లో భూక్యా రవి(38) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండగా కాలనీవాసులు వెళ్లి చూడగా, రవి మంచంపై చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో వచ్చిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా రెండు నెలల క్రితం రవి భార్య నీల దండుమిట్టతండాలోని పుట్టింటికి వెళ్లింది. మూడేళ్లుగా మరో మహిళతో రవి సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఆమెతో గొడవ జరిగిందని, అంతకంటే ముందే భార్య నీలతో గొడవ జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రవి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు విచారణ చేపట్టారు.

క్లుప్తంగా...

ఇరిగేషన్ ఏఈఈల పదోన్నతులకు హైకోర్టు ఓకే



సాక్షి, హైదరాబాద్: ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో 11 ఏళ్ల సర్వీసున్న అసిస్టెంట్ ఇంజనీర్ల పదోన్నతికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారంతా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతికి అర్హులేనని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జారీ చేసిన జీవో నంబర్ 112 సమర్థనీయమేనని స్పష్టం చేసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. నిబంధనలు సవరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెప్పింది. 2022, మార్చి 26న రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 112ను సవాల్ చేస్తూ నల్లగొండ మిర్యాలగూడకు చెందిన శ్రీనివాస్ నాయక్ సహా కొందరు ఏఈఈలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ జీవో తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ సర్వీస్ రూల్స్ 2018కి విరుద్ధమన్నారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం తుది ఉత్తర్వులు వెలువరించింది. ఏఈల ఇంప్లీడ్ పిటిషన్ వేసిన న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ఏఈలకు కూడా పదోన్నతులు ఇవ్వవచ్చని గతంలో ఇదే హైకోర్టులోని డివిజన్ బెంచ్ ఉత్తర్వు లు జారీ చేసిందని చెప్పారు. వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ప్రభుత్వ జీవోను సమర్థించింది. జీవోకు వ్య తిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది.

'రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లూ బదిలీకి అర్హులే'

సాక్షి, హైదరాబాద్: రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లు కూడా బదిలీలకు అర్హులేనని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే రెండేళ్ల కంటే ఎక్కువ సర్వీసున్న వారి బదిలీలు పూర్తయిన తర్వాత, మిగిలిన ఖాళీలకే తక్కువ సర్వీసున్న వారి దరఖాస్తులు పరిశీలించి, బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. టీచర్ల బదిలీల కోసం ప్రభుత్వం జనవరి 25న జారీ చేసిన జీఓ నంబర్ 5, ఫిబ్రవరి 7న జారీ చేసిన జీఓ నంబర్ 9లో తమకు అవకాశం ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ పెద్దపల్లి జిల్లాకు చెందిన సొదమల్ల స్రవంతితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి కాలేదన్న కారణంగా తమను పరస్పర బదిలీకి కూడా అనుమతించకపోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్ల బదిలీలకూ అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

రేపు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం

- ఒకేసారి అందుబాటులోకి 9 వైద్య కాలేజీలు!
- సీఎం చేతుల మీదుగా ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయి. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శుక్రవారం వాటిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామల్లో కొత్తగా ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర సొంత నిధులతో ఒకే ఏడాది ఇంత పెద్దసంఖ్యలో మెడికల్ కాలేజీలు ప్రారంభించడం దేశంలోనే ఇదే ప్రథమంగా చెబుతున్నారు.

కేసీఆర్ హయాంలోనే 21 మెడికల్ కళాశాలలు

తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, సీఎం కేసీఆర్ దశాబ్ద కాలంలోనే 21 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. కాగా, వచ్చే ఏడాది ప్రారంభించేందుకు మంజూరు చేసుకున్న 8 మెడికల్ కాలేజీలతో ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు పూర్తవుతుందని అధికారులు అంటున్నారు. 2014లో 5 మెడికల్ కాలేజీల ద్వారా 850 సీట్లు ఉంటే, 2023 నాటికి 26 మెడికల్ కాలేజీలతో సీట్ల సంఖ్య 3,690కి చేరింది. ప్రభుత్వ ప్రైవేటులో కలిపి ఏటా పది వేల మంది విద్యార్థులను తయారు చేసే స్థాయికి నేడు తెలంగాణ ఎదిగింది.

చట్టంలో మార్పులతో విస్తృత అవకాశాలు

2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటీటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్ కు ప్రభుత్వం సవరణ చేసిన సంగతి తెలిసిందే. గతంలో 85శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వ్‌డుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. తాజా నిర్ణయం వల్ల మన విద్యార్థులకు మరో 520 సీట్లు దక్కాయి. దీంతో పాటు ఎంబీబీఎస్ బీ కేటగిరి సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకోవడం వల్ల రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మరో 1,300 ఎంబీబీఎస్ సీట్లు దక్కాయి. ఈ రెండు నిర్ణయాల వల్ల తెలంగాణ విద్యార్థులకు అదనంగా మొత్తం 1,820 సీట్లు ప్రతి ఏటా దక్కనున్నాయి.

సంపద పెరగాలంటే పరిశ్రమలు రావాలి

- మంత్రి కేటీఆర్
- సంగారెడ్డి జిల్లాలో మొనిన్ పరిశ్రమకు శంకుస్థాపన


మొనిన్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. రాజకీయాలు ఎన్నికలు వచ్చినప్పుడు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, సంపద పెరగాలన్నా కొత్త పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు పెడితే స్థానికులకు నష్టం జరుగుతుందని కొందరు రాజకీయం కోసం వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అపోహలకు గురికాకుండా స్థానిక నాయకులు పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రీమియం సిరప్ తయారీ కంపెనీ మొనిన్ రూ.300 కోట్ల పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా గుంతపల్లిలో నిర్మించతలపెట్టిన ఫ్యాక్టరీకి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ప్రగతిశీల విధానాలను చూసి వివిధ దేశాలకు చెందిన కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మొనిన్ కంపెనీ యాజమాన్యం దేశంలో 18 రాష్ట్రాల్లో తిరిగిందని, చివరకు తెలంగాణలో యూనిట్‌ను స్థాపిస్తోందని చెప్పారు. స్థానిక యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఈ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.

ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానం..

రాష్ట్రం వ్యవసాయ రంగంలో గణనీయ వృద్ధిని సాధించిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68 వేల మెట్రిక్ టన్నుల నుంచి మూడున్నర లక్షల టన్నులకు చేరి దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి బాటలో కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, మొనిన్ సంస్థ చైర్మన్ ఓలివర్ మొనిన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే ఇక ఉపేక్షించం

మరింత బలోపేతంగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు: డీఎంఈ రమేశ్ రెడ్డి

గాంధీఆస్పత్రి: రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని, ఆయా కళాశాలలకు చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూ పొందించి అమలు చేస్తామని మెడికల్ ఎడ్యు కేషన్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన పదిమంది వైద్యవిద్యార్థులను ఏడాది పాటు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ పలువురు వైద్యవిద్యార్థు లు గురువారం గాంధీ కళాశాల ప్రాంగణంలో నిర సన చేపట్టారు. ఈ క్రమంలో డీఎంఈ, గాంధీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమో హన్, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తదిత రులు పలువురు వైద్యవిద్యార్థులతో మాట్లా డారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఆ పదిమంది సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధా రణ అయిందనీ, చర్యల విషయంలో పునరాలోచన లేదని స్పష్టం చేశారు.

అడిషనల్ డీజీ శిఖాగోయల్ ఆరా

ర్యాగింగ్ ఘటనపై తెలంగాణ అడి షనల్ డైరెక్టర్ జనరల్, ఉమెన్ సేఫ్టీ వింగ్, యాంటీ ర్యాగింగ్ కమిటీ అధికారి శిఖాగోయల్ ఆరా తీశారు. డీఎంఈ, గాంధీ ప్రిన్సి పాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించినట్లు తెలి సింది. సస్పెన్షన్‌తో ఏడాది వైద్యవిద్యను మాత్రమే కోల్పోతారని, కేసులు పెడితే విద్యార్థులు జీవితాలు నష్టపోవడంతో పాటు వారి కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతాయనే ఉద్దేశంతో సస్పెన్షన్‌తో సరిపెట్టామని డీఎంఈ రమేశ్‌రెడ్డి వివరించినట్లు సమాచారం.

'బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బిల్లుతో ఉపయోగం లేదు'



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోందని, ఈ బిల్లులో బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగినట్లేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ మహిళలకు ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లుతో బీసీలకు ఉపయోగం లేదని, అందుకే మహిళా బిల్లును బీసీలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

టెట్ పరీక్షా కేంద్రాలున్న విద్యా సంస్థలకు ఒకటిన్నర రోజుల సెలవు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈనెల 15న జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలుగా ఎంపికైన విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఒకటిన్నర రోజుల పాటు సెలవు ప్రకటించింది. ఆ విద్యా సంస్థల్లో టెట్ పరీక్షల ఏర్పాట్ల కోసం ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం సగం పూట, పరీక్ష రోజైన 15వ తేదీ ఉదయం, మధ్యాహ్నం ఈ కేంద్రాలకు సెలవు ఇస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ పరీక్షా కేంద్రాలున్నాయి. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ఈ పరీక్షలు ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి



ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ఎన్నికలు ముంచుకొస్తుండడంతో పరీక్షలు ఇంకెప్పుడు జరుగుతాయనే అయోమయానికి గురవుతున్నారు.

సన్నద్ధతకు సంకటం

ఏదైనా పరీక్ష తేదీని ప్రకటిస్తే అభ్యర్థులు సన్నద్ధతకు ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. ప్రభుత్వ శాఖల్లో వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పూనుకోవడం, తదనుగుణంగా నోటిఫికేషన్లు ఇవ్వడంతో నిరుద్యోగ అభ్యర్థులు కఠోర దీక్షతో ప్రిపరేషన్‌లో పడ్డారు. కొందరు ప్రైవేటు ఉద్యోగాలను వదిలేసి మరీ సిద్ధమవుతున్నారు. మరికొందరైతే పనిచేస్తున్న ఉద్యోగాలకు దీర్ఘకాలిక సెలవులు పెట్టుకుని టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల తేదీలను ప్రకటించకుండా కమిషన్ కాలయాపన చేస్తుండటంతో సన్నద్ధత గాడి తప్పుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ నెలంతా ప్రభుత్వ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకు అర్హత పరీక్షలు కొనసాగుతుండగా.. వచ్చే నెలలో సైతం పలు పరీక్షలకు కమిషన్ తేదీలు ఖరారు చేసింది. ఆగస్టు నెలలో నిర్వహించాల్సిన గ్రూప్–2 పరీక్ష నవంబర్ నెలకు వాయిదా పడింది. ఈ విధంగా పలు పరీక్షల తేదీలు ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్–3 పరీక్షలపై తేల్చక పోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

హైదరాబాద్‌లో ఇన్‌స్పైర్ బ్రాండ్స్ ఇన్నోవేషన్ సెంటర్

కేటీఆర్‌తో భేటీ సందర్భంగా కంపెనీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా మల్టీబ్రాండ్ రెస్టారెంట్ కంపెనీగా పేరొందిన 'ఇన్‌స్పైర్ బ్రాండ్స్' హైదరాబాద్‌లో ఆవిష్కరణల కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో బుధవారం భేటీ అయిన కంపెనీ సహ వ్యవస్థాపకులు, సీఈఓ పాల్ బ్రౌన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 32 వేల రెస్టారెంట్లను కలిగిన ఇన్‌స్పైర్‌కు హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ఆవిష్కరణల కేంద్రం ఆరవదిగా కానుంది. హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న ఆవిష్కరణల కేంద్రం గత ఆరు నెలల్లో వంద మందికి ఉద్యోగాలు కల్పించగా, వచ్చే ఆరు నెలల్లో మరో వంద మందిని చేర్చుకోనుంది. 2025 నాటికి హైదరాబాద్‌లో మరో 500 మందిని చేర్చుకుంటుందని పాల్ బ్రౌన్ ప్రకటించారు. ఈ ఆవిష్కరణల కేంద్రం ద్వారా డేటాసైన్స్, అనలిటిక్స్, ఈ కామర్స్, ఆటోమేషన్, క్లౌడ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ వంటి రంగాల్లో పనిచేసే సంస్థల భాగస్వామ్యంతో ఆవిష్కరణల కోసం పనిచేస్తుంది. ఆవిష్కరణల కేంద్రంలో ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ ల్యాబ్ ద్వారా మానవ వనరుల నిర్వహణ, చెల్లింపు విధానాలు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు తదితరాల కోసం స్థానిక స్టార్టప్‌లతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంటుంది.

17 నుంచి 'ఆయుష్మాన్ భవ'

అక్టోబర్ 2 వరకు ఆరోగ్య మేళాలు, ఇతర సేవలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పేరుతో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర పథకానికి సంబంధించి రాష్ట్రంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా పల్లె, బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో ఈ నెల 20, 27 తేదీల్లో ఆరోగ్య మేళాలు నిర్వహిస్తారు. రక్తపోటు, మధుమేహం, మూడు సాధారణ క్యాన్సర్లు అంటే ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. టీబీ, లెప్రసీ వంటి పరీక్షలు చేస్తారు. లైఫ్‌స్టయిల్ వంటి కార్యక్రమాలు చేపడతారు. ఉచిత మందులు ఇస్తారు. ఉచిత డయాగ్నస్టిక్స్ అందుబాటులో ఉంటాయి. టెలీకన్సల్టేషన్ సేవలు కల్పిస్తారు. అక్టోబర్ 2న రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల సమన్వయంతో ప్రతి జిల్లాలో ఒక శిబిరాన్ని నిర్వహిస్తారు.

జిల్లా వార్తలు

బ్లాస్టింగ్ ఆపరేషన్స్‌ను తనిఖీ చేసిన జీఎం


బ్లాస్టింగ్‌ను పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఓసీలో బొగ్గు వెలికితీతకు చేపడుతున్న బ్లాస్టింగ్ ఆపరేషన్స్‌ను సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్లాస్టింగ్ సందర్భంగా భారీగా శబ్దాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటూనే ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఓసీ ఎం.వీ.నర్సింహారావు, అధికారులు రామకృష్ణ, గోపికిషోర్, సురేష్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డికి పదోన్నతి


కట్టా దామోదర్‌రెడ్డి

పాల్వంచరూరల్: పాల్వంచ వన్యప్రాణుల సంరక్షణ విభాగం ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డికి పదోన్నతి లభించింది. ఆయనకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పదోన్నతి కల్పిస్తూ పీసీసీఎఫ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, పాల్వంచ అటవీ డివిజన్ ఎఫ్‌డీఓ తిర్మల్‌రావు ఇటీవల అచ్చంపేటకు బదిలీ కాగా, ఆ స్థానంలో దామోదర్‌రెడ్డికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు అందాయని డీఎఫ్ఓ కృష్ణగౌడ్ తెలిపారు.

తాలిపేరుకు కొనసాగుతున్న వరద

చర్ల: చర్ల మండలం పెదమిడిసిలేరు సమీపంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రం వరకు కూడా వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు రెండు రోజులుగా వరద వచ్చి చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లలో 10 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 6,489 క్యూసెక్కుల చొప్పున వరదను దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74మీటర్లు కాగా, వరద ఉధృతిని పరిగణనలోకి తీసుకుని 72.85 మీటర్ల వద్ద క్రమబద్ధీకరిస్తున్నారు.

అప్పీలా.. కొత్త నోటిఫికేషనా?!

- డోలాయమానంలో సింగరేణి అధికారులు
- జూనియర్ అసిస్టెంట్ పరీక్షను రద్దు చేసిన హైకోర్టు
- లోపభూయిష్టమైన విధానాలతో కోర్టుకెక్కుతున్న అభ్యర్థులు


క్లరికల్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్(క్లరికల్ గ్రేడ్–2) పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ 4వ తేదీన రాతపరీక్ష నిర్వహించారు. అయితే, కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో రాతపరీక్షను రద్దు చేసి మరోమారు నోటిఫికేషన్ ఇవ్వాలని గత నెల 28న హైకోర్టు సింగరేణిని ఆదేశించింది. కాగా, హైకోర్టు ఆదేశాలను పాటించాలా... లేక అప్పీల్‌కు వెళ్లాలా అనే అంశంపై సింగరేణి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులు పలువురు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉన్నందున సంస్థ కూడా ఏ నిర్ణయం తీసుకోవాలో తేల్చుకోలేక సందిగ్ధంలో ఉన్నట్లు తెలిసింది.

ఎనిమిదేళ్ల తర్వాత పరీక్ష

సింగరేణిలో సుమారు ఎనిమిదేళ్ల తర్వాత 177 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా సుమారు లక్ష మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా, స్క్రూటినీ అనంతరం 98,882 మందికి సంస్థ హాల్‌టికెట్లు జారీ చేసింది. వీరిలో 77,907 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎనిమిది జిల్లాల్లోని 187 కేంద్రాలను పరీక్ష నిర్వహించిన సంస్థ... గత ఏడాది సెప్టెంబర్ 9వ తేదీన ఫలితాలను విడుదల చేసింది. అయితే, కొందరు అభ్యర్థులకు ప్రశ్నపత్రం ఇవ్వకపోవడం, ఇంకొందరి ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాల బుక్‌లెట్లపై సంస్థ ముద్ర లేకపోవడంతో, మరికొందరిని తనిఖీ చేయకుండానే కేంద్రాల్లోకి అనుమతించారని చెబుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై వాదనల అనంతరం పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు తాజాగా తీర్పు చెప్పింది. ఏళ్ల తర్వాత నోటిఫికేషన్ రావడంతో కష్టపడి చదివిన అభ్యర్థులు ఎలాగైనా ఉద్యోగం సాధిస్తామనే నమ్మకంతో ఉన్న నేపథ్యాన సంస్థ తప్పిదాల కారణంగా హైకోర్టు నుంచి వచ్చిన తీర్పు వారిని నిరాశకు గురిచేసింది.

అధికారుల పట్టింపులేని తనంతోనే...

సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ పరీక్ష నిర్వహించిన రోజే ఫలితాలను విడుదల చేస్తుందని, తద్వారా ఎలాంటి అవకతవకలు జరగవనే నమ్మకం ఉండేది. అయితే, రానురాను సంస్థ తీరుపై అభ్యర్థులకు నమ్మకం సడలిపోయింది. 2015లో జరిగిన క్లరికల్ పరీక్షలోనూ అనేక తప్పిదాలు బయటపడ్డాయి. పోస్టులు అమ్ముకున్నారని, ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి ఉద్యోగాలు వచ్చాయనే అపవాదు ఎదురైంది. అయినప్పటికీ ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇక ఓ అధికారి సామాజిక వర్గానికి చెందిన వారికే ఉద్యోగాలు వచ్చాయనే ఆరోపణలు ఉన్నా స్పందన రాలేదు. ఆ తర్వాత 01 మార్చి 2020న జరిగిన ఈఅండ్ఎం గ్రేడ్–2(ఎగ్జిక్యూటివ్ కేడర్) పరీక్షకు సైతం ఇతర రాష్ట్రాల అభ్యర్థులు హాజరుకాగా, సింగరేణి ఉన్నతాధికారులే గుర్తించారు.

ఆతర్వాత వారి విచారణ సాగుతుండగానే బెయిల్ రావడంతో కేసు తెరమరుగైంది. ఈకేసుకు సంబంధించి సంస్థ ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు తేలగా, ఫలితాలు వెల్లడించొద్దని పోలీసు ఉన్నతాధికారులు సూచించినా సంస్థ అధికారులు పెడచెవిన పెట్టి 68 పోస్టుల్లో 58 మందిని నియమించినట్లు ప్రచారం జరిగింది. ఇలా ఏ పరీక్ష నిర్వహించినా లోపాలు బయటపడుతున్నా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగ పరీక్షల్లో పేరున్న టీఎస్‌పీఎస్సీ వంటి సంస్థల అధికారుల సలహాలు తీసుకుంటే పరీక్ష పూర్తయ్యాక తలనొప్పులు ఎదురుకావని తెలిసినా ఆ దిశగా దృష్టి సారించకపోవడం గమనార్హం. ఫలితంగా ఎంతో ఆశతో నెలల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు చివరకు నిరాశకు గురి కావాల్సి వస్తోంది. కాగా, తాజాగా వెలువడిన హైకోర్టు తీర్పుపై సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్యను వివరణ కోరగా, కంపెనీ న్యాయ విభాగం ఉద్యోగులు, ఉన్నతాధికారులు త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిపారు.

రూ.కోట్లలో చెల్లించినా ...

సింగరేణి సంస్థలో నియామకాలకు సంబంధించి ఏ పరీక్ష అయినా గతంలో సంస్థే నిర్వహించేది. ఇటీవల బదిలీ వర్కర్లు 665 పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షకు సుమారు 30 వేల మంది హాజరైనా ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తిచేశారు. అయితే, 2015, 2022లో నిర్వహించిన క్లరికల్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను మాత్రం బయటి సంస్థకు అప్పగించి రూ.3కోట్లు చెల్లించినట్లు సమాచారం. అయినా అనేక లోపాలు బయటపడడంతో కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా పరీక్షను రద్దు చేయాల్సి వచ్చింది. ఇకనైనా సంస్థ ఉన్నతాధికారులు నియామకాల విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు.

స్వరాష్ట్రంలోనే సింగరేణికి కష్టాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఏర్పడ్డాక పాలకుల తీరుతో సింగరేణికి కష్టాలు ఎదురవుతున్నాయని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు పి.మాధవనాయక్ ఆరోపించారు. కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ఏరియర్స్, బోనస్ చెల్లింపు విషయంలో జాప్యం చేయడం.. ఆపై ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. కార్మికులకు చెల్లించే ప్రతీపైసా వారి కష్టార్జితమేనని తెలిపా రు. అంతేకాక కార్మికులు చెమటోడ్చి రూ.వేలకోట్లను ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తున్నారని చెప్పారు. కాగా, కోల్ ఇండియాలో కార్మికులకు 23నెలల ఎరియర్స్‌ను ఈనెల 3వ తేదీనే చెల్లించినా సింగరేణిలో మాత్రం జాప్యం చేశారని మాధవనాయక్ విమర్శించారు. సమావేశంలో నాయకులు పవన్‌కుమార్, ఎం.రవి, ఊట్ల గణేష్, ఎం.శ్రీనివాసరావు, సుందర్, రాంసింగ్, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, మోహన్, యాదగిరి పాల్గొన్నారు.

పత్తి, మిర్చిని ఆశిస్తున్న తెగుళ్లు

సస్యరక్షణ చర్యలపై కేవీకే శాస్త్రవేత్తల సూచనలు


తల్లాడ : పత్తిలో తెగుళ్లను పరిశీలిస్తున్న వైరా కేవీకే శాస్త్రవేత్తలు

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లిలో బుధవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రవికుమార్, చైతన్య, జెస్సీ పత్తి, మిర్చి పైర్లను పరిశీలించి సస్య రక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా కీటకం విభాగం శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ పత్తి పంటలో పచ్చ దోమ, తామర పురుగుల ఉధృతి ఉన్నందున పచ్చదోమ నివారణకు పిప్రోనిల్ 400 మి.లీ. లేదా ఇమిడాక్లోపిడ్ 50 మి.లీ. లేదా పోనికామిడ్ 60 గ్రాములు, తామర పురుగు నివారణకు డయాపిన్థియూరాన్ 250 గ్రాములను పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, సోకిన మిర్చి మొక్కలను పీకి నాశనం చేయాలని తెలిపారు. రైతులు ఏవీకే.రెడ్డి, శ్రీనివాస రెడ్డి, లక్ష్మారెడ్డి, ఒలేటి రవి, వ్యవసాయ విస్తరణాధికారి నాగేశ్వర్‌రావు, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తిలో పిండినల్లి

కొణిజర్ల: కొణిజర్ల మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటను పిండినల్లి ఆశించిందని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో పత్తి, మిర్చి పంటలను బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. పత్తిలో కాండం చుట్టూ తెల్లగా పిండి మాదిరి చుట్టుకుని పురుగులు కాండం రసాన్ని పీల్చేడంతో చెట్టు ఎండిపోతుందన్నారు. పిండినల్లి కనిపించిన వెంటనే గోనె బస్తా లేదా కాటన్ బట్టతో తుడిస్తే కొంత ఫలితం ఉంటుందని తెలిపారు. ఇక ఉధృతి ఉంటే ప్రొఫెనోఫాస్ 2 ఎం.ఎల్.ను లీటర్ నీటికి కలిపి కాండం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఇక మిర్చిలో వేరుకుళ్లు నివారణకు కాపర్, స్ట్రెప్టోమైసిన్ కలిపి చెట్టు మొదట్లో చేతి పంపుతో పిచికారీ చేయాలని, పైముడత నివారణకు తగిన మందులు ఉపయోగించాలని సూచించారు. కాగా, రసాయన మందులు కాకుండా సేంద్రియ విధానాలు పాటిస్తే మేలని ఆయన తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయ షాపులు, చీరల టెండర్లు వాయిదా

కొబ్బరిచిప్పల వేలంలో రూ.2లక్షల మేర అదనపు ఆదాయం


టెండర్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న అధికారులు, పాలకమండలి సభ్యులు

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మ తల్లి) గుడి సమీపాన నిర్మించిన షాపుల వేలం మరోమారు వాయిదా పడింది. అలాగే, అమ్మ వారికి భక్తులు సమర్పించిన చీరలు పోగు చేసుకునే హక్కు కోసం పోటీ లేకపోవడంతో వాయిదా వేశా రు. ఆలయంలో బుధవారం 11షాపుల కేటాయింపుతో పాటు చీరలు, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్. రజనీకుమారి, ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం సమక్షంలో వేలం జరిగింది. కాగా, కొబ్బరిచిప్పలను ఏడాది పాటు పోగు చేసుకునేందు కు నలుగురు పోటీ పడగా కారేపల్లికి చెందిన పి.యాదలక్ష్మి రూ.10,51,000కు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.2.51లక్షల ఆదాయం అదనంగా లభించిందని ఈఓ తెలిపారు. ఇక 11 షాపుల్లో ఒకే షాపు కోసం నలుగురు, చీరలు పోగు చేసుకునేందుకు ముగ్గురే వేలంలో పాల్గొనడంతో ఈనెల 23వ తేదీకి వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు చింత నాగరాజు, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, గంధం వెంగళరావు, ఎస్.వెంకట రామారావు పాల్గొన్నారు.

అధికారుల భిన్న ప్రకటనలపై నిర్వాసితుల్లో ఆందోళన

ఇల్లెందురూరల్: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో సాగు భూముల విషయమై వివిధ శాఖ అధికారులు చేస్తున్న భిన్నమైన ప్రకటనలతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సర్వే ప్రారంభ సమయాన సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో నాటి తహసిల్దార్, సర్వే ముగిసినప్పుడు అప్పటి ఆర్డీఓ రైతులకు భరోసా కల్పిస్తూ ప్రకటన చేశారు. నిర్వాసిత ప్రాంతం అటవీ, రెవెన్యూ భూభాగమైనా సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో భూములు కోల్పోయినా పరిహారం అందుతుందని రైతులు నమ్మారు. అనంతరం అనర్హుల పేర్లు నిర్వాసిత జాబితాలో చేరడంతో ఆందోళన చెందారు. ఇంతలోనే అధికారులు రీ సర్వేకు సిద్ధం కాగా, అటవీ, రెవెన్యూ భూముల హద్దులు కేటాయించాకే సర్వే చేయాలని రైతులు పట్టుపట్టడంతో వాయిదా పడింది. ఇదే సమయాన రైతులు వారి భూములకు సంబంధించి ఆధారాలు చూపాలని, వాణిజ్య పంటలు ఉంటే పరిహారం వర్తించదని అటవీశాఖ అధికారులు చెప్పడం గమనార్హం. దీంతో రైతులు బుధవారం సర్వేకు హాజరుకాకుండా నేరుగా కలెక్టర్ ప్రియాంక అలను కలిసి సర్వే నంబర్ 549కి సంబంధించి ఏర్పడిన గందరగోళాన్ని వివరించారు.